35

# ఆచరణలేని విద్యలన్నీ నిరుపయోగమైనవే!

**మనసు నిర్మలంబు మంచికి మార్గంబు**
**మనసు నిర్మలంబు మహితశక్తి**
**నిర్మలంబు మనస్సు ఉండినది ముఖ్యంబె**
**వినుడు భారతీయ వీరసుతుడ!**

భారతదేశపు ఉపరాష్ట్రపతియైన శంకర్ దయాళ్ శర్మ, ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

మానవుడు సుఖాభిలాషి. ఆనందపిపాసి. సుఖానందములను అనుభవింపగోరి రాత్రింబవలు మానవుడు వాటిని పొందే నిమిత్తమై అనేక శ్రమలను పడుతున్నాడు. కాని పొందగలుగుచున్నాడా, లేదు. కారణము? మానవునియొక్క దృష్టి బాహ్య సంబంధమైన, ప్రాకృత పదార్థములపైన అభివృద్ధిపరచుకోటంచేత తాను పొందవలసిన ఆనందము, సుఖములకు అతిదూరమైపోతున్నాడు.

**దృష్టిని అంతర్ముఖము గావించినప్పుడు నీవే శాంతిస్వరూపుడవౌతావు**

బాహ్య ప్రపంచమనగా యేమిటి? శరీరము, యింద్రియములు, మనస్సు, బుద్ధి, వీనియొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యమే యీ బహిర్ముఖమైన బాహ్యప్రపంచము. ఇది కేవలము క్షేత్రమువంటిది. దీనిలోపల క్షేత్రజ్ఞుడు ఆత్మస్వరూపుడై ఉంటున్నాడు. అతని దృష్టి లేక, కేవలము బాహ్యమైన దృష్టినే అలవరచుకోటంచేత మనము దుఃఖములకు, అశాంతికి గురౌతున్నాము. మానవునకు సుఖముగాని, దుఃఖముగాని బాహ్య ప్రపంచముతో గల అనుబంధముచేతనే యేర్పడుతున్నాయి. జనన, మరణములు మనకు దుఃఖమును అందించుచున్నవని మనము భ్రమిస్తున్నాము కాని సుఖదుఃఖముల నందించునది, జనన మరణములు కావు. ఆ జనన మరణములతో కూడిన ఉపాధిపై ఉండిన అనుబంధమే మనకు సుఖదుఃఖములందించుచున్నది. నిజానికి ఆనందము, సుఖము, శాంతి మీ స్వరూపమే! యీశాంతి అనేది బాహ్యప్రపంచములో లభించేది కాదు. నీదృష్టిని అంతర్ముఖము

sri sathyasai vachanamrutam

గావించినప్పుడు నీవే శాంతి స్వరూపుడవౌతావు. నీవే శాంతిస్వరూపుడవై బాహ్య ప్రపంచములో శాంతిని వెదకుటకు ప్రయత్నించటము యిది కేవలము అజ్ఞానముయొక్క చిహ్నమే.

**బాధ్యతలు పెంచుకొనుకొలది మానవునకు దుఃఖము పెరుగుతుంది**

విద్యార్థులారా! బాహ్యసంబంధమైన వస్తువులతో సంబంధము అభివృద్ధి గావించుకోటంచేతనే మనము అమితమైన అశాంతికి గుర్రైపోతున్నాము. ఈ సంబంధమును ఎంతెంత తగ్గించుకొందుమో అంత శాంతిని మనము పొందగల్గుతాము. ఒక చిన్న ఉదాహరణము. ఒక మధ్యతరగతి కుటుంబీకుడు అనేక విధములైన బాధలు పడుతున్నాడు. తన కుటుంబమును పోషించుకొనలేక నిరంతరము రాత్రిపగలు దుఃఖముతో కుమిలిపోతున్నాడు. ఈ కుటుంబాన్ని నేను పోషించే విధానమేది అని అనేక విధములైన మార్గములు వెతికాడు. కాని లభించలేదు. ఆ వ్యక్తి మరింత లోతుగా ఆలోచించాడు. నావలె కుటుంబ బాధ్యతలు భరించలేక ఎంతమంది వ్యక్తులీ ప్రపంచములో బాధలకు గురౌతున్నారో, వారిని కూడా కొంత హెచ్చరించాలని సంకల్పించుకున్నాడు. ఒక బోర్డును వ్రాసాడు. తన పేరును వ్రాసి ప్రక్కన F.S.S. F.T.D. అని డిగ్రీలు వ్రాసి బోర్డు వేలాడదీశాడు. యీ డిగ్రీలు యేమిటో, ఎక్కడ ప్యాసై వచ్చాడో, విదేశాలలో ప్యాసైనాడో యేమోనని అనేకమంది దానిని విచారణ చేస్తూ వచ్చారు. కొంతమంది విద్యార్థులు ధైర్యము చేసి ఆ వ్యక్తి యింటిలో ప్రవేశించి "సార్! మీరు ఏమి ప్యాస్ అయినారు? ఈ F.S.S. F.T.D. వీని అర్థము యేమిట"ని ప్రశ్నించారు. ఆ వ్యక్తి సమాధానం చెపుతూ F.S.S. అనగా Father of six sons అన్నాడు. ఇక F.T.D. అనగా Father of ten daughters. ఈ విధంగా Six sons, ten daughters ఉంటే తన కుటుంబాన్ని యేరీతిగా పోషించుకోగలడు? ఇది చాలా విచారకరమైన విషయము. ఈ విధముగా బాధ్యతలు పెంచుకొనుకొలది మానవునకు దుఃఖము పెరుగుతుందేగాని, అశాంతి అభివృద్ధి అవుతుందేగాని, శాంతి సుఖములు లభించవు.

**మానవుడు కోరికలు ఎంత తగ్గించుకుంటే అంతగా సుఖశాంతులు లభిస్తాయి**

మానవుని జీవితము దీర్ఘప్రయాణము. ఇందులో మన desires ఎంత తగ్గించుకుంటే అంత సుఖశాంతులు పొందుతాము. దీనినే రైల్వే డిపార్టుమెంటు వారు Less luggage

srisathyasaivachanamrutam

more comfort, make travel a pleasure అన్నారు. మనయొక్క కోరికలే మన లగేజి. విద్యార్థులు, యువకులు. నిత్యనిర్మలమైన సత్యమార్గములో ప్రవేశించవలసినవారు. కానీ, దురదృష్టవశాత్తు ఈనాడు విద్యార్థులలో అనేక విధములైన కోరికలు ప్రవేశించి వారిని ఉన్మత్తులుగా చేస్తున్నాయి. విద్యార్థులు, కోరవలసింది ఏమిటి, అనే విచారణ చేయటం లేదు. నీకు నీవు పరీక్షించుకో! 'నేను విద్యార్థినా లేక విషయార్థినా,' అని. విద్యార్థిగా నీవు ప్రవేశించి విషయార్థిగా రూపొందినప్పుడు అశాంతి shadow వలె వెంట ఉంటుంది. మానవునియందు రెండు విధములైన తత్త్వములున్నవి. మానవునికి రెండు విధములైన రూపములున్నవి. భగవద్గీతలో కృష్ణుడు రెండు విధములైన ధర్మాలను ప్రబోధిస్తూ వచ్చాడు, 'స్వధర్మము, పరధర్మము'. స్వధర్మమంటే ఏమిటి? నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను వైశ్యుడను, నేను శూద్రుడను, యిది కాదు ధర్మము. 'స్వ' అనగా ఆత్మ. స్వధర్మము అనగా ఆత్మ ధర్మము. ఇక రెండవది, పరధర్మము అనగా దేహసంబంధమైన ధర్మము. స్వధర్మ, ఇదే సామీప్య, సాలోక్య, సారూప్య, సాయుజ్యములు. స్వధర్మమనేది కేవలం ఆత్మధర్మము. ఈ స్వధర్మముయొక్క తత్త్వము యేమిటి? 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం'. ఈ పవిత్రమైన, దివ్యమైన భావములు హృదయమునందు ఆవిర్భవించి మానవుని పవిత్రమైన మార్గములో ప్రవేశింపచేసే ఆత్మధర్మములు. పరధర్మమనగా దేహమునకు సంబంధించినది. మీలో చాలామందికి తెలుసు. భారతదేశము విదేశీయుల చేతిలో కుమిలిపోతున్న సమయములో దీనిని బానిసత్వమునుండి వేరుగావించి స్వతంత్రమును పొందాలని అనేకమంది భారతీయులు దీని నిమిత్తమై పోరాటము సలుపుతూ వచ్చిరి. అప్పుకొక రకమైన కీలకాన్ని వారు అనుసరిస్తూ వచ్చారు. స్వదేశీ వస్తువులే వాడాలి, పరదేశమునుండి దిగుమతి చేసుకున్న వస్తువులు వాడకూడదనే నిర్ణయాన్ని తీసుకున్నారు. 'స్వదేశము', 'విదేశము', అని ఉపయోగించారు. అనగా మనదేశముయొక్క వస్తువులే మనము వాడాలి, విదేశీ వస్తువులు వాడకూడదు అని. స్వదేశము, విదేశము అని కొంత భౌగోళిక సరిహద్దును నియమించుకోటంచేత స్వాతంత్ర్యము పొంది విజయాన్ని సాధించగలిగారు. బాహ్య జగత్తునందు స్వదేశము అన్న భావమును ఉపయోగం చేసుకోటంచేతనే స్వరాజ్యమును పొందగలిగారు. నిజానికి, స్వరాజ్యం అంటే ఆత్మ సామ్రాజ్యము. దీనిని పొందేటందుకు ఆత్మగుణములే ఉపయోగించుకోవాలని

sri sathyasai vahini amrutam

దీనికి ఒక అర్థము. స్వబుద్ధులనే ఉపయోగించాలి. స్వగుణములనే పాటించాలి. స్వభావములనే మనము ఆచరించాలి. అనగా ఆత్మభావములు, ఆత్మసంకల్పములు. ఇవి మన హృదయమునకు సంబంధించినవి. దానిని మనము అనుసరించినప్పుడే అదేమన witness గా రూపొందుతుంది. కనుక, స్వబుద్ధితో స్వగుణాన్ని స్వప్రయత్నముచే పొందినప్పుడే మనకు స్వరాజ్యము లభిస్తుంది.

### విద్యార్థులు దేశాభిమానమును పోషించుకోవాలి

విద్యార్థులారా! భారతదేశముయొక్క ప్రాచీన సాంప్రదాయమును, సంస్కృతిని అభివృద్ధి చేయాలనుకున్నప్పుడు ఆ ప్రాచీన సంస్కృతికి సంబంధించిన సనాతన ధర్మాన్ని మనము పెంచాలి. సంస్కృతి అంటే యేమిటి? ఈ సంస్కృతి అంటే యేమిటో ప్రజలకుగాని, విద్యార్థులకుగాని యీనాడు పూర్తిగా విచారించే అవకాశములేదు. మన సంస్కృతి కేవలము యీనాటిది కాదు. కొందరికి యింద్రియ వికాసము ఉండవచ్చును, మానసిక వికాసము ఉండవచ్చును, బుద్ధి వికాసము కూడా ఉండవచ్చును. అయితే, ఈ యింద్రియ, మనస్సు, బుద్ధి వికాసములతోపాటు ఆధ్యాత్మిక వికాసముకూడా ఉండాలి. ఈ నాల్గింటియొక్క సమగ్రశక్తియే భారతీయ సంస్కృతి. మానసిక వికాసము, యింద్రియ వికాసము, బుద్ధి వికాసము, ఆధ్యాత్మిక వికాసము, యీ నాల్గింటి సమగ్రతను యేనాడు మనము సాధిస్తామో ఆనాడే భారతీయ సంస్కృతిని మనము పునరుద్ధరించినవారమవుతాము. విద్యార్థులు మనప్రాచీన సంస్కృతికి సంబంధించిన గుణములను అభివృద్ధిపరచుకున్నప్పుడే భారతదేశము నిత్యకళ్యాణము పచ్చతోరణములతో కలకలలాడుతుంది. విద్యార్థులు దేశాభిమానమును పోషించుకోవాలి. దేహాభిమానము మనకెంత అవసరమో దేశాభిమానముకూడా అంతే అవసరము. రాముడు చెప్పాడు, 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని. నాయొక్క తల్లి, నాకు జన్మయిచ్చినదేశము నాకు పవిత్రమైనవి. దీనికి మించిన స్వర్గము నాకక్కరలేదన్నాడు.

### భారతదేశముయొక్క భవిష్యత్తంతా ఈనాటి యువకులపైన ఆధారపడియున్నది

కనుక, దేశముయొక్క అభివృద్ధిని మన హృదయమునందుంచుకొని, ఆధ్యాత్మిక, భౌతిక క్రియలలో మనము ప్రవేశించినప్పుడు యిహమున సుఖము, పరమున ఆనందము రెండింటినీ మనము పొందగలము.

srisathyasaivachanamrutam

**వేదవేదాంగములు వల్లెవేసియున్న**
**పద్యగద్యంబులను నేర్చగలిగియున్న**
**చిత్తశుద్ధియు లేకున్న చెడునువాడు**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు.**

వేదశాస్త్ర యితిహాస పురాణములయొక్క ప్రమాణములను ప్రధాన లక్ష్యములో ఉంచుకొని తమ జీవితమును ఒకదైవార్పిత జీవితముగా అనుభవిస్తూ వచ్చిన దేశము, భారతదేశము.

**బుద్ధి బలము మరియు భుజబలంబునను**
**దైవబలము లేక దీనుడగును**
**కర్ణుడంతవాడు కడపటి కేమయ్యె**

కర్ణునికి సర్వబలములు ఉంటున్నాయి. కానీ దైవాజ్ఞను మీరినాడు. భుజబలము, బుద్ధి బలము, ధన బలము, జనబలము ఇలా సర్వబలములుండికూడా దైవబలము లేకపోతే మానవుడు దీనుడే!

విద్యాబలము అత్యవసరమే! కానీ, ఈనాటి విద్యలు విద్యలు కానేరవు.

**నేటి విద్యలు తెలివితేటలనే పెంచు**
**కొంచెమైన గుణము పెంచబోవు.**

గుణము కావాలి. కేవలము పుస్తకాలనంతా మస్తకములోనికి తీసుకొని, మస్తకాన్ని ప్రాక్టికల్‌లో పెట్టకపోతే నీగుణము నీప్రవర్తన యేమిటి? ఆచరణయోగ్యము కావాలి. 'ఆచార్య'అంటే ఆచరణతో కూడుకున్నవాడని. మన వైస్‌ప్రెసిడెంటు శర్మగారు చెప్పారు, 'ఆచరణ లేని విద్యలన్నీ నిరుపయోగమైనవే' అని. మీరందరు భవిష్యత్తులో భారతదేశమునకు నాయకులుగా, పాలకులుగా తయారుకావాలి. భారతదేశము యొక్క భవిష్యత్తంతా యీనాటి యువకులపైన ఆధారపడి ఉంది. మీరు భావిభారతోద్ధారకులు. ఈనాటి విద్యార్థులే భవిష్యత్తులో లీడర్సు, ప్లీడర్సు. అలాంటి విద్యార్థులు తయారుకానప్పుడు, దేశము అనేక విధములైన చిక్కుల పాలౌతుంది. యీనాటి నాయకులంతా ఒకప్పుడు విద్యార్థులే! దీనిని మీరు మరువరాదు.

sri sathyasai vachanamrutam

ఈనాటి విద్యార్థులే భవిష్యత్తులో నాయకులు కావచ్చును. కనుక దేశసౌభాగ్యాన్ని, సౌశీల్యమును, ఉత్కృష్టతను, పవిత్రతను మీరు లక్ష్యము నందుంచుకొనియే మీయొక్క ప్రయాణమును ముందుకు సాగించాలి. ఈనాడు సైన్సు, టెక్నాలజీ అనేక విధములుగా పెరిగిపోతున్నవి. ఈ సైన్సు ఏవిధముగా ఉన్నతస్థాయికి పెరిగిపోతోందో సెన్సు అంత క్రిందిస్థాయికి దిగజారిపోతున్నది. కనుక, మనయొక్క అభివృద్ధి సెన్సుతో అభివృద్ధి కావాలి. "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః", ఈ మనసే మన మోక్షమునకు, ఒకవిధమైన బంధమునకు మూలకారణము. మనసును సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి నీవు దానికి సరైన మాష్టరుగా నిలచి, సరైన ఆచరణలో జీవితాన్ని గడపిన, నీకంటె ఉన్నతుడు మరొకడు లేడు.

**'సత్' అనే పరమాత్మ, 'చిత్' అనే జీవాత్మ, ఈరెండింటి ఏకత్వమే ఆనందమనే దివ్యాత్మ**

విద్యార్థులారా! యీనాటి ప్రపంచముయొక్క పరిస్థితి మీకు తెలియనిది కాదు. అనేక రకములైన అల్లకల్లోలములతో, అశాంతితో కుమిలిపోతున్న ఈనాటి భారతదేశాన్ని సరియైన స్థితిలో తీర్చిదిద్దటానికి విద్యార్థులే తగిన సమర్థులనే విషయాన్ని మీరు గుర్తించి, వర్తించాలి. విద్య అంటే కేవలము గ్రంథపరిచయము మాత్రమేకాదు. ఈ బుక్కిష్ నాలెడ్జితో మనము యేమీ సాధించలేము. ప్రాక్టికల్ నాలెడ్జికావాలి. దీనికి ముందుగా discrimination knowlede ఉండాలి. ఇంతేకాదు general knowledge కూడా కావాలి. మనము textbooks లో తెలుసుకునే జ్ఞానముకంటె general knowledge, common sence అత్యవసరము. కనుక, man అనగా awareness is man. అన్నింటినీ తెలుసుకోవాలి. అదే సత్ చిత్ ఆనందము. సత్ being, చిత్ అనగా awareness. ఈ రెండింటియొక్క యేకత్వముతో ఆనందము మనకు లభిస్తుంది. సత్ is water. చిత్ is sugar. sugar ఒక సైడ్ ఉంది. నీరు ఒకవైపు ఉంది. యివి రెండు ప్రత్యేకముగా ఉంటే ప్రయోజనము లేదు. ఈ రెండింటిని యేకముగా చేసినప్పుడు పానకముగా తయారౌతుంది. అదే ఆనందము. సత్ అనే పరమాత్మ, చిత్ అనే జీవాత్మ, ఈరెండింటియొక్క యేకత్వమే ఆనందమనే దివ్యాత్మ.

ఆ దివ్యాత్మ లక్షణములు ఏమిటి?

sri sathyasai vachanamrutam

**బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిమ్**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్**
**ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతమ్**
**భావాతీతం త్రిగుణరహితం సద్గురుం**

ఆ పవిత్రమైన, దివ్యమైన గుణములు ప్రతి విద్యార్థియందు అభివృద్ధి కావాలి. భగవంతుడు ఒక్కడే, 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ'. అదే 'మమాత్మ సర్వభూతాంతరాత్మ'. కనుక, ప్రతివ్యక్తిని మీరు దైవాత్మగా భావించినప్పుడు యెట్టి బాధలు ఉండవు. విద్యార్థులారా! మీరు పంచభూతములయొక్క సంబంధముకాదు, ప్రకృతియొక్క అంశముకాదు. 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', 'మమైవాంశో', మీ అందరు నాఅంశమే! అని భగవద్గీత చక్కగా చాటింది. కనుక మిమ్మల్ని మీరు దైవాంశములుగా భావించాలి. కేవలము Brotherhood of man, fatherhood of God కూడను అంత గొప్పది కాదు. Brothers, brothers ప్రోపరిటీకోసమని సుప్రీమ్ కోర్టువరకు పోయి కుటుంబాలను నాశనము చేసుకున్నవారు ఎందరోఉన్నారు. కనుక brotherhood of man ప్రాచీనకాలమునకు సంబంధించినది. యిప్పుడు ప్రస్తుత పరిస్థితిలోపల, ఏకాత్మ భావము చాలా ఉత్తమమైనది. I and you are one, యీ విధమైన విశాల భావమును పెంచుకోవాలి. కేవలము దైవచింతనచేత, దైవప్రార్థనచేతనే దైవానుగ్రహము లభిస్తుంది. విద్యార్థులారా! మీలో మానవతా విలువలైన త్రిమూర్తులను పెంచుకుంటూ రావాలి. ఇందులో మొదటిది, భగవత్ప్రీతి. దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి, యివి పెంచుకోండి, చాలు.

**(తేదీ. 20-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam